# కుక్కలు

-కె.కె. రఘునందన

కుక్కలు... ఏ వీధిలో... ఏ సందులో చూసినా కుక్కలు... అంతటా కుక్కలే... అవి ఒకరు పెంచుకున్నవి కావు... ఊరకుక్కలు... వాటిని చూసి ఎందరో విసుక్కుంటున్నారు... తిట్టుకుంటున్నారు...

తమ పెంకుటిళ్ళు తొక్కేస్తున్నాయని ఒకరంటే... మా పెంపుడు పిల్లుల్ని నిలువునా చీరేస్తున్నాయని ఓ ఇల్లాలి గగ్గోలు... స్కూలుకెళ్ళే పిల్లల పిక్కలు పీకేస్తున్నాయని స్కూలు హెడ్మాస్టర్ రిపోర్టు...

కుక్కల కాట్లాటలు పెచ్చుమీరిపోతున్నాయని, వెంటనే అరికట్టాలని గోల...

ఇలా అన్ని వర్గాల వారు ధ్వజమెత్తడంతో సర్పంచ్ సత్యం తలపట్టుకున్నాడు.

"ఈ కుక్కల బెడద కాదుగాని... నా పీకకు చుట్టుకున్నట్లుంది.." అన్నాడు సత్యం.

"అసలీ కుక్కలు పట్నం వాళ్ళు తోలేస్తే మన పల్లె టూర్లు పట్టేశాయి. కాని, ఇంతకు ముందు ఇన్ని లేనే లేవు..." పంచాయతీ సెక్రటరీ చెప్పుకొచ్చాడు.

ఇటీవల కాలంలో పట్నంలో కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. దాంతో మున్సిపాలిటీ వారికి మొరపెట్టుకుంది ప్రజ... వారి బాధ పడలేని మున్సిపాలిటీ కుక్కల నిర్మూలన కార్యక్రమం ప్రారంభించింది... అడపాదడపా వాటిని అంతమొందించ సాగింది.

ముఖ్యంగా కుక్కలను పట్టేసి ఓ బండిలో కూరేసి చివరగా... చక్కని పాకిస్తే అవన్నీ గుటుక్కుమంటాయి. లేదా మరో క్రూరమైన శిక్ష ఏమంటే వెదురు కర్రలతో వాటికి బడితె పూజచేయటం... దానికి సరియైన మనుషులను బతాయిస్తారు. వాళ్ళకు ముందుగా మందు కొట్టిస్తారు. ఆ మత్తులో ఏం చేస్తున్నదీ తెలీకుండా పిచ్చెత్తినట్లుగా కుక్కల మీద మరణ మృదంగం వాయిస్తారు. ఆ కుక్కలు నెత్తురోడుతూ చాలాసేపు గిలగిల కొట్టుకుంటూ నేల కరుస్తాయి.

అయితే మరో పద్ధతుంది... అదింకా విదేశాలు దాటి ఈ దేశం చేరలేదు. కుక్కలకు మామూలుగా చిన్న ఇంజక్షన్ చేస్తారు. అది క్రమేపి పనిచేసి మత్తులో పడేసి నిశ్శబ్దంగా చంపేస్తుంది. బహుశా 'మెర్సీ కిల్లింగ్' కావచ్చు!!

కాని, మనదేశం అటువంటి దయాపూరిత మరణ శాసనాలు తయారుచేసిన దాఖలాలులేవు.

ఇంక వీధి కుక్కల్లో చాలామట్టుకు తప్పించుకుని గ్రామాలు వచ్చినవే (గ్రామ సింహాలు కదా!) ఏదయితేనేం 'సతివాడ'ను పట్టి పీడించే ఏకైక సమస్య కుక్కలు...!!

అవే ముందు ముందు రాబోయే ఎన్నికలకు అడ్డు కావచ్చు. అదెలాగంటే ఈ కుక్కల సమస్య తీర్చకుంటే ప్రజలు వెర్రెత్తిపోతారు. కాబట్టి ఏదో ఒకటి చేయాలని సర్పంచ్ సత్యం ముందుకు ఉరికాడు.

కాని అతని భార్య మాత్రం ససేమిరా అంటూ అడ్డు పడింది. "కోరి మూగజీవాలను బలిపెడితే మనింటికి అరిష్టం చుట్టుకుంటుంది... దానివల్ల మనకు కష్టాలు వచ్చిపడతాయి."

"ఈ కుక్కలను చంపి పారేయకపోతే మనల్ని చంపేట్టున్నారు జనం..." కొడుకు వసుదేవ్ ఊరివాళ్ళ మనోగతాన్ని తల్లి దగ్గర చెప్పాడు...

గత ఎన్నికల్లోనే సత్యం సతివాడకు ప్రెసిడెంటయ్యాడు. ఇదివరలో ఉన్న పాత ప్రెసిడెంటు మీద విముఖత సత్యంను గెలుపు వీరుడిని చేసింది.

మరో సంవత్సరంలో ఎన్నికలు వస్తాయి.. ఈలోగా ఈ కుక్కల సమస్య తీర్చకపోతే ఆ ప్రభావం తన గెలుపు మీద పడవచ్చు. ఇదే సమయం, సందర్భం అనుకున్న కొందరు గిట్టనివాళ్ళు, ఊర్లో కుర్రాళ్ళని రెచ్చగొట్టి సర్పంచు సత్యంపైకి దాడికి పంపిస్తున్నారు.

ఈ తలనొప్పుల్ని అనుభవిస్తూనే, అడిగిన ప్రతీవారికి జవాబు చెప్పలేక నానా తంటాలు పడసాగాడు సత్యం.

❖ ❖ ❖

ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి మరీ రామమందిరం దగ్గర్లో ఓ బెల్టుషాపు ... దాని చుట్టూరా అయిదారు కిల్లీ బడ్డీలు... హోటేళ్ళు... చీకులమ్మేవాళ్ళు, పకోడి కొట్టు...

ఇది సతివాడ సెంటర్‌లో వాతావరణం.

బెల్టుషాపుకి ఉదయం పూట అరకొరగా బేరాలుంటాయి. సాయంత్రం అవటంతోటే బేరాలు పుంజుకుంటాయి. నెల్లిమర్ల, విజయనగరం కూలిపనుల కెళ్ళి తిరిగొచ్చిన వాళ్ళు సతివాడ సెంటర్‌కి చేరుకుని చీప్ లిక్కర్ వేసుకుని కాస్త సేద తీరుతారు.

ఊళ్ళో వాళ్ళు కూడా... ఆ సమయానికి అక్కడికి చేరతారు. రొచ్చు రాజకీయాలు మొదలౌతాయి. వాదోపవాదాలు సాగుతాయి. మందుకొట్టిన బాపతులెవరూ ఊరికే ఉండరు. ఒకరినొకరు తూర్పారబెట్టుకుంటారు... జుత్తులు పీక్కుంటారు. ఒక్కో సమయంలో సోడాబుడ్లు గాల్లో ఢీకొంటాయి...

ఏ రోజు కారోజు కొత్తే... కుర్రాళ్ళ అలజడిలో తగ్గుముఖం ఉండదు...

ముఖ్యంగా ఆ ఊర్లో ఆడవాళ్ళనెలా తమ ఉచ్చులోకి లాక్కోవాలోనని తెగ పథకాలు తయారు చేస్తుంటారు.

ఆ బెల్టుషాపుకి పదడుగుల దూరంలోనే పానకాలు తాత గుడిసె ఉన్నది... వాడికో మనవరాలుంది. పేరు లచ్చి. ఏ రాజమహల్లోనో రాణిగా పుట్టాల్సినది పోయి శని నెత్తికెక్కి ఈ పాకలో పడింది. అంత అందగత్తె... ఏ ఒంపుకి ఆ ఒంపు స్పష్టంగా విప్పారింది.

లచ్చిలాటి అందగత్తెను ఓ జుర్రు జుర్రాలని ఎప్పటి కప్పుడు ఆలోచనలు చేసే ఊళ్ళో కుర్రాళ్ళతో పాటు, పై నుండి బెల్టు షాపు పేరుపెట్టుకుని వచ్చిన పై ఊరోళ్ళు కూడా పోటీకి దిగుతున్నారు.

ఇది తాతకు ఎరికే! తల్లిదండ్రుల్లేని లచ్చిని ఎండ పొడ పడకుండా సాకిన మాట నిజం... అది తాతకు శక్తి ఉన్నన్నాళ్ళు జరిగిపోయింది... ఎదిగిన లచ్చి తాత పడే యాతన చూడలేక పనిలోకి వెళతానంది... నాలుగు డబ్బులు తెస్తేగాని గంజి కాయటం తప్పదని పానకాలు కూడా ఊరుకున్నాడు.

అదే కుర్రకారుకి అలుసయింది. తాపీవారితో జీపు లెక్కడం, సైకిళ్ళెక్కడం తప్పలేదు... తనసెవరయినా తాకితే తేళ్ళు... జెర్రులు పాకినట్లుండేది లచ్చికి...

ఏదో మిష పెట్టుకుని పానకాలు తాత పాకలోకి వెళ్ళేవారు. కర్రపెట్టి తగిలేవాడు తాత. లచ్చి కూడా కస్సుమనేది. తాతకు కూడా ఓ కుక్క ఉంది... అది అరిచేది... మీద పడేది...

ఆ కుక్కంటే లచ్చికి చాలా ఇష్టం... ఒకసారి పని లోంచి దిగివస్తుంటే ఆత్రిపాలెం సెంటర్‌లో రోడ్డుమీద నెత్తురోడుతూ పడివున్న పసికూనను తెచ్చి పెంచుకుంది. తదాదిగా వాళ్ళని అంటిపెట్టుకుని ఉందా కుక్క

కుక్క మీద పడినా కొందరు లచ్చిని ఎలాగయినా పట్టేయాలని మీదకి వచ్చేవారు.. వాళ్ళ దగ్గర వెధవ కంపు భరించలేకపోయేది లచ్చి. ఈ రోజువారీ రభస పానకాలుకి నచ్చేది కాదు.

ఈ మధ్యన లచ్చిమీద సర్పంచ్ కొడుకు వసుదేవ్ కన్ను పడిందని, ఆ నోట్లో, ఈ నోట్లో నాని చివరకు బెల్టుషాపు దగ్గరకి చేరింది. అతగాడికి పోటీగా లచ్చిని ఎగరేసుకుపోటానికి చాలామంది ప్రయత్నించసాగారు. వాళ్ళ ప్రయత్నాలను సర్వశక్తులూ ఒడ్డి అడ్డుపడేవారు ప్రెసిడెంటు కొడుకు వర్గం...

ఒక్కో సమయంలో కర్రలు గాల్లోకి లేచేవి... కుర్రాళ్ళు పరుగులెట్టేవారు. పానకాలు తాత పాకను ఊడబెరికి మరీ వదిలేవారు. జగడం ఆగినా మరల ఎవరూ సరి చేసేవారు కాదు. కడుపు తరుక్కుపోయేలా ఏడ్చుకుని తనే పాకను నిలబెట్టేది లచ్చి.

ఇది సర్వ సాధారణం అయిపోయింది ఆ సెంటర్‌కి.

❖ ❖ ❖

"ఇంచుమించు... నా లెక్క ప్రకారం... ఎనభై నుండి వందదాకా కుక్కలున్నాయి. వాటినన్నింటినీ ఈ గ్రామం నుండి తగిలెయ్యటానికి వీలుకాదు... కుక్కల బండి కోసం మున్సిపాలిటీ వారికి దరఖాస్తు పెడితే మూలపడిందని చెప్పేసారు. ఇంక చేయాల్సింది బడితెపూజ ఒకటే!!" అన్నాడు పంచాయతీ సెక్రటరీ...

"మీరన్నదే రైటులా తోస్తోంది. దాని గురించి నేనూ భోగట్టా చేసాను. కుక్కలను కొట్టేవాళ్ళు విజయనగరంలో ఉన్నారట. వాళ్ళొస్తే మకాం ఏర్పాటు చేయాలి... మందు కొట్టించాలి. మస్తుగా మాంసం వండిపెట్టాలి. అలా అయితే గాని పనిలోకి దిగరు" సర్పంచు సత్యం చెప్పాడు.

"కుక్కకి నలభై చొప్పున అడుగుతున్నారు.. మొత్తం చంపించాలంటే రమారమి ఖర్చు ఓ ఆరువేల దాకా ఉండవచ్చు..." మునిస్వామి అనే గ్రామ పెద్ద అన్నాడు.

"చంపటం తేలికే... మరి చచ్చిన వాటికి దహన సంస్కారాలో" సెక్రటరీ మాటకి సర్పంచ్ గట్టిగా నవ్వాడు.

"ఈ వెధవ కుక్కలకి దహన సంస్కారాలొహటా! వాటిని కప్పిపెట్టడానికి ఓ పెద్ద బంటా తవ్వితే చాలు..." అన్నాడు సత్యం.

"దానికి మాత్రం ఖర్చవదూ! ఎంత పెద్ద బంటావో తవ్వితే తప్ప వంద కుక్కలూ పట్టవు... కాని తప్పదు" అన్నాడు సెక్రటరీ.

అందరూ ఆసక్తిగా వింటున్నారు.

"బెల్టుషాపు వేలంపాట సొమ్ము పంచాయతీలో ఉంది... అంతేకాదు ఊళ్ళో కుర్రాళ్ళు చేసిన తప్పులకి కట్టిన జరిమానాల బాపతు కూడా కొంతుంది. వాటితో ఈ కార్యక్రమం జరిపిస్తే బాగుంటుందని నా ఉద్దేశం" అని ఆగి అందరి మొహాల్లోకి చూశాడు సత్యం.

"మీరెలాగంటే అలాగే... వెధవ కుక్కలు కాదు గాని... ఇన్ని వేలు ఖర్చు పెట్టిస్తున్నాయి..." అన్నాడు జయరాం

మేస్తారు.

"అవి బ్రతికుంటే ఇంటింటికీ ఖర్చే!... ఇలాగయితే ఒక్కసారి పీడ విరగడయిపోతుంది..." అన్నాడు సెక్రటరీ...

అందరి తీర్మానం మీద కుక్కలను నిర్మూలించే కార్యక్రమానికి సర్వం సిద్ధం చేయ సంకల్పించారు.

అయితే పంచాయతీ సొమ్ములోంచి ఖర్చుపెట్టడం ఏమాత్రం బాగోలేదని యాగీ చేసినవారు లేకపోలేదు... అయినా పని ఆగలేదు.

పట్నంలో మున్సిపాలిటీ వారి ద్వారా కుక్కలు కొట్టే వారికి కబురు పెట్టారు.

❖ ❖ ❖

బెల్టుషాపు పోటెత్తిన సముద్రంలా ఉంది. బొప్పడాం గ్రామంలో.. గైరమ్మ తల్లి జాతర.. జనం చీప్ లిక్కర్ కోసం సతివాడ సెంటర్‌కి వచ్చారు. లూజ్ కావలసిన వారికి కొలిచి పోస్తున్నారు. గుట్కాలు ఖైనీలు... పరపర చిరుగుతున్నాయి.

బొప్పడాం జాతరకు పోయేవారికి అదేదారి... ఆడ పిల్లలు అటునుండి పోతుంటే తాగుబోతు రాయుళ్ళ మతులు ఎక్కడెక్కడికో పోతున్నాయి. కనుమూసిన చీకటిలో వారికి కనువిందుగా ఉంది. కొందరు ధైర్యం చేసి పైటలు లాగసాగారు. జబర్దస్తీగా ఎత్తుకెళ్ళారు కొందరు. చోట్లు కోసం వెతుక్కున్నారు. అది చూసిన ఆడపిల్లల మనుషులు అగ్గెత్తిపోయారు.

"కొవ్వెక్కిందిరా దొంగనా కొడకల్లారా... మీ పూర్లంట ఎల్లున్నామని మీ కంత సులకనయిపోనామ్రా... మిమ్మల్ని ముక్కలుగా నరికినా పాపం నేదురా..." ఆ కేకలకి కుర్రాళ్ళు ఆడపిల్లలను వదిలిపెట్టి పరుగులెత్తారు.

బాహాబాహీగా దెబ్బలాటలు జరిగాయి సెంటర్‌లో... పానకాలు తాత కుక్క తన ప్రతాపం చూపింది... అరుపులు కర్ణకఠోరంగా ఉన్నాయి.

ఇదంతా చూచాయగా తెలుసుకున్న తాతకి లచ్చి గురించిన బెంగతో గుండె గుభిల్లుమంది... లచ్చి తనకేం కాలేదని చెప్పింది. ఆ సమయంలో ఇద్దరు ముగ్గురు మనుషులు రెచ్చిపోయి పాకలోకి చొరబడ్డారు... చేగోడీలు నములుకుంటూ...

"లచ్చేదిరా?" ఆగ్రహంగా అడిగారు.

"లేదు... అయినా ఎందుకూ?"

"దేనికా..? దేనికో చెబితే నీ గుండె ఆగిపోద్ది..." అని బూతులు తిట్టారు.

మూలన నక్కిన లచ్చి భీతితో అంతా వింటున్నది... కుక్క మీదకి ఉరికింది... కరవటానికి ప్రయత్నించింది.. . వెంట పడింది.. పారిపోయారు. కుక్కని లచ్చి ఆప్యాయంగా నిమిరింది.

"అమ్మా! మనవింక ఈ సెంటర్‌లో బతకలేం.. ఈ తాగుబోతెదవలు నిప్పుతొక్కిన కోతుల్లాగ గెంతుతుంటారు... నిన్నో అయ్య సేతిలో పెట్టేదాకా నాకు బెంగనే..." అని కుమిలిపోయాడు పానకాలు...

అదే సమయంలో బయట పెద్ద అరుపులు... కుర్రాళ్ళు కుమ్ములాడుకుంటున్నారు. సోడాబుడ్లు ఎగిరిపోయి... తలలు పగిలాయి.

❖ ❖ ❖

కుక్కలు కొట్టేవాళ్ళకి బస ఏర్పాటయింది. మందు సిద్ధం చేశారు. మంచి చేవ వున్న వెదురు కర్రలు పెట్టారు.

మొత్తం పదిహేను వీధులు... ఇంచుమించు వంద దాకా కుక్కలు. మందుకొట్టినాక... కర్రలు తీసుకుని ఊర్లోకి బయలుదేరారు వాళ్ళు. వెంట సెక్రటరీ కూడా ఉన్నాడు.

కంటికి కనబడిన కుక్కనల్లా కర్రెత్తి బాదసాగారు. 'కుయ్యో మొర్రో' మని మూల్గులు... డొక్కల్లో... మక్కల్లో... ఒకటి లేదా రెండు దెబ్బలకి సఫా!... ఎర్రెర్రని రక్తం... దారంటా కారుతూ... గిలగిలలాడుతూ కుక్కలు...!

అవి ఎంత నికృష్టమైన పనులు చేశాయోగాని, అంత నికృష్టమైన చావును కోరి తెచ్చుకున్నాయి.

సందు గొందులు... వీధులు... వాడలూ.. కాలువలు... కంతలూ... డాబాలు... చెట్ల గుబుర్లు... ఇలా ఎక్కడున్నాసరే జాడ తెలుసుకుని మరీ చంపుతున్నారు.

శునక సంహారం విశృంఖలంగా సాగుతోంది.. అభం శుభం తెలీని పసికూనలకి కూడా మినహాయింపు లేదు... జనంలో కొందరు జాలిపడ్డవారు కూడా లేకపోలేదు.

కాని తప్పదు... ప్రజల కోరిక... కుక్కలు చావాలి. మనుషులు బ్రతకాలి. హాయిగా.. చీకు చింత లేకుండా..

అదే పద్ధతిలో సాగుతోంది సంహార పర్వం... కుక్కలు కొట్టేవాళ్ళు తమ నిర్దాక్షిణ్యాన్ని, కరుకుతనాన్ని చాటుతున్నారు.

బెల్ట్ షాపు దగ్గర ఆగారు. బ్రాందీ మరో నాలుగు పెగ్గులు బిగించారు.

అప్పుడే కుక్క ఒకటి ఆగి ఆగి అరుస్తున్నది... ఇంక ఎక్కడా కుక్కల వాసనే లేదనుకుంటుంటే ఈ అరుపు ఎక్కడి నుంచి అనుకున్న వాళ్ళకు వెర్రెత్తిపోయింది. తమ కళ్ళ నుంచి తప్పించుకున్న ఆ కుక్క మొరుగు భరించ లేకపోయారు.

"అదిగో పానకాలు తాత పాకలోంచే... దాన్ని ఆడు పెంచుకుంటున్నాడు..." అన్నాడు పకోడి కొట్టువాడు.

"అసలే కుక్కల బాధ పడ్నేకపోతున్నామని పూర్ల అంతా గోలెడ్తుంటే కుక్కని పెంచుకోడవేటి?" అని పాకలోకి దూసుకెళ్ళారు.

"అదిగోరా నల్ల కుక్క.. పట్టుకో..." అన్నాడు ఒకడు.

"ఎవుర్రా మీరు?.. పదండి బయటకు" అదిలించాడు తాత.

"ఆ ఆగు... కుక్కను కూడా మాతో పట్టుకుపోతాం.." అన్నాడు మరోడు. కుక్క ఎగిరి మీద పడింది.

"అమ్మ! నీకిలాగు కాదెహె...! రోడ్డు మీద పాత రేయాలి" అని నాలుగువైపులా కాసి కుక్కను పట్టేసారు.

అది లచ్చి చూసింది.

"ఒరే దొంగ నా కొడకా! మా కుక్క నొదిలేయ్‌రా.. అది మా పెంపుడు కుక్కరా..." అని కుక్కను లాక్కోబోయింది.

కర్రతో అడ్డాడు వాడు. కర్ర జాడించింది లచ్చి... తోసేసారు.

క్రింద పడింది లచ్చి.. మరల కుక్క దూకింది.

"అమ్మ... దీనికింత పొగరుగుందా; చెబుతా..." అని కుక్కను పట్టుకుని రోడ్డు మీదకి విసిరేసాడొకడు.

"ఏసెయ్‌రా! ఏసెయ్..." కర్రలు ఊపందుకున్నాయి...

ఒకే ఒక్క వేటుతో చచ్చి పడిందది.

లచ్చి కళ్ళకు వాళ్ళంతా బ్రహ్మరాక్షసుల్లా కనిపించారు–

"ఓరి ముదనష్టపోల్లారా... మీకేం పోయేకాలాల్రా... మా కుక్కని సంపడాన్కి మీకు సేతులెట్టావచ్చినాయిరా..." పిచ్చిగా అరిచింది.

"ఏంటే గుంటా పేల్తున్నావు..." అని పాకలోకి బలవంతంగా లాక్కెళ్ళారు.

-పానకాలు అడ్డుపడ్డాడు.. బలంగా తోసేసారు.

ఇది చూసిన ప్రెసిడెంటు కొడుకు వసుదేవ్ వర్గం పాకలోకి దూరి వాళ్ళకి నాలుగు చీవాట్లు పెట్టి లచ్చిని విడిపించారు.

"చూశావా లచ్చీ! మాలాటోల్లు అడ్డుకోబట్టీ మీరిద్దరూ మిగిల్నారు..." అన్నారు వసుదేవ్ మనుషులు..

ఆ రగడ అప్పటితో ఆగింది.

కాని లచ్చి పానకాలులో బాధా పరితప్తత ఇంకా ఆగలేదు.

శునక సంహారం సమాప్తయింది.

కుక్కలు కొట్టిన వాళ్ళు చివరిసారిగా మందులాగించి డబ్బులు అందుకుని ఉడాయించారు.

అదే రోజు రాత్రి సర్పంచ్ కొడుకు వసుదేవ్ బెల్టుషాప్ దగ్గర సద్దుమణిగాక గుట్టు చప్పుడు కాకుండా పానకాలు తాత పాకలోకి దూరాడు.

లచ్చి నులక మంచం మీద పడుకునుంది... వసుదేవ్‌ను చూసి గబుక్కున లేచింది... అరవబోయింది.

"గట్టిగా అరవమాకు... నేనే వసుదేవ్‌ను... చాలా కాలమై నీమీద మనసైంది... నేనెపుడొచ్చినా ఎదవ కుక్క అరిసి అల్లరి సేసేది... అందుకే దాన్నీ కొట్టించేసాను... ఈ యాల్నుండి మనకి అడ్డునేదు.. మజా సేస్కుందాం.. రా..." అని బలవంతంగా మీద పడి నోరు మూసాడు.

మూలనున్న బుడ్డిదీపం ఆర్పేసాడు.

కుక్కపోయిన బెంగతోటి... జ్వరంతోటి మూలుగుతున్నాడు తాత. వసుదేవ్ ఆగడానికి అడ్డు ఆపు లేకపోయింది. తన వెర్రిదాహానికి లచ్చిని వాడుకున్నాడు.

వసుదేవ్ వెళ్ళిపోయాడు.. పొర్లి పొర్లి ఏడ్చింది లచ్చి.. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లుగా మరో ఇద్దరు ఆమెపై పైశాచికంగా ప్రవర్తించారు..

జ్వరంతో మూలుగుతున్న తాత తెలతెలవారుతుంటే లేచాడు మూలుగేదో వినిపించి చూశాడు. లేచి తడుముకుంటూ వెళ్ళాడు.

మంచం దగ్గర కొచ్చిన తాతను పట్టుకుని – "తాతా!... ఆ తాగుబోతు నాయాల్లు... అదే పెసిడెంటు కుర్రోడు... ఆడి ఎనకాల తిరిగే వెదవలు... నన్ను..." లచ్చి గొంతు మరి పెగల్లేదు...

అంత నీరసంలోనూ ఆగ్రహం పెల్లుబికింది పానకాలు తాతలో... లేని శక్తిని కొని తెచ్చుకుని బెల్టుషాపు సెంటర్‌కి నడిచాడు.

"థూ నాయాల్డి... ఎదవల్లారా... దిక్కుమాలిన్నా కొడకల్లారా... వూరకుక్కలు యిరగబడి పోతన్నాయని ఆట్ని కొట్టించేశారు. గోతులు తవ్వేసి కప్పెట్టేసారు... కాని, అవి నోరు వోయి లేనివిరా... వుచ్చం... నీచం యేటో తెల్వనివిరా... మరి ఈ మడుసులు వూరకుక్కల కంటే అద్వాన్నంరా... పూటుగా తాగేసి ఆడకూతుల్ల మీద పడతార్రా... మా బతుకుల్తోటి ఆడుకుంటార్రా... ఈ 'వూరి కుక్కల్ని' ఎవులు కొట్టి సంపుతార్రా... ఎవులు కప్పెడతార్రా... దీనికి ఎవులు ముందుకొత్తార్రా... ఒరే మావేం తప్పుసేసామని ఈ శిచ్చ.. మాలచ్చి తల్లిని బల్సేసారు. మీకే నేయం... దరమం నేవా... థూ పురుగులు పడి సత్తార్రా..." అని రొప్పుతూ అరుస్తున్న పానకాలు తాత రోడ్డు మీద కుప్పకూలిపోయాడు.

ఆ సమయంలోనే లచ్చి ప్రాణం కూడా కడంటి పోయింది.

చోద్యం చూడటానికన్నట్లుగా ఒకరొకరే పోగవసాగారు...

■